మురుగు చెరువుతో వ్యాధుల భయం

- వెదజల్లుతున్న దుర్గంధం
- విజృంభిస్తున్న దోమలు
- శనివారపు పేట వాసుల్లో భయాందోళన


శనివారపుపేటలో నివాసాల మధ్య మురుగునీటితో నిండిన కుమ్మరిగొయ్యి

ఏలూరు రూరల్ : శనివారపుపేట కుమ్మరిగొయ్యి మురుగునీటి చెరువుగా మారిపోయింది. వర్షాకాలంలోనే కాదు వేసవికాలంలో సైతం మురుగు నీరు ముందుకు పారక పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలు విజృంభించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఒకప్పుడు శనివారపుపేటలో కుమ్మరులు నీటి అవసరాలకు తీర్చిన గొయ్యి. ఇప్పుడు కుమ్మరిగొయ్యిగా మారింది. సుమారు ఐదెకరాల విస్తీర్ణం గల గొయ్యి మురుగునీటితో నిండిపోయింది. దీనిచుట్టూ తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. పందుల మురుగులో సంచరిస్తుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పసర్ల పట్టిన నీటిలో పాములు, పురుగులు దర్శనమిస్తున్నాయి. మొదట్లో కుమ్మరి గొయ్యి చుట్టూ పదుల సంఖ్యలో నివాసాలు ఉండేవి. ఇప్పుడు దొండపాడు, రెడ్డివారి వీధి, ఆకుతోట, సీతాగార్డెన్స్ ప్రాంతాల్లో సుమారు వెయ్యికిపైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ అభివృద్ధి చేయకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు ఈ గొయ్యిలోకి చేరుతోంది. ఏడాది పొడవునా కుమ్మరిగొయ్యి మురుగునీటితో నిండుకుండలా దర్శనమిస్తోంది.

కోర్టు వివాదం

ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్న కుమ్మరి గొయ్యి వివాదం ఏళ్ల తరబడి కోర్టులో నడుస్తోంది. కొన్నేళ్ల క్రితం ఈ గొయ్యి స్థలంలో అధికారులు ప్రభుత్వ పాఠశాల నిర్మించి, పిల్లలు విద్యాబుద్ధులు నేర్పారు. వర్షాకాలంలో పాఠశాల భవనం పైకప్పు నుంచి నీరు కారుతుందని విద్యాశాఖాధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ క్రమంలో ఈ భూమి తనకు చెందుతుందని ఒక వ్యక్తి కోర్టులో కేసు వేసి అడ్డుకున్నారు. దీనిపై స్పందించిన నాటి పంచాయతీ పాలకవర్గం, రెవెన్యూ అధికారులు సైతం కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదు. ఫలితంగా కుమ్మరిగొయ్యి మురుగుకూపంగా మారిపోయింది.


కుమ్మరి గొయ్యిలో కలుస్తున్న డ్రెయినేజీ మురుగు


వైఎస్సార్ సీపీ హయాంలో మాలపల్లిలో నిర్మించిన పక్కా డ్రెయినేజీ

దుర్గంధం

ఎండ, వర్షం కాలం ఏదైనా ఏడాది పొడవునా కుమ్మరిగొయ్యి మురుగునీటితో దర్శనమిస్తోంది. ఒక్కటే దుర్గంధం. పందుల సంచారం ఎక్కువైంది. దుర్గంధం కారణంగా రోగాలు ప్రబలే ప్రమాదం ఏర్పడింది. గొయ్యి సమస్యతో చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందడం లేదు. ఏళ్ల తరబడి పారిశుధ్య సమస్య ఇలాగే వేధిస్తోంది.

– ఎస్ సోమశేఖర్, రెడ్డివారి వీధి

మురుగునీరు కిందకు పోవాలి

కొన్నేళ్ల క్రితం మురుగునీరు ఇళ్ల ముందే ఉండేది. గత ప్రభుత్వం మాలపల్లిలో డ్రెయిన్ నిర్మించింది. ఇళ్లలో మురుగు సాఫీగా పారుతోంది. కొన్నిసార్లు పారిశుధ్య సిబ్బంది డ్రెయిన్ శుభ్రం చేయడం లేదు. చేసేది లేక చుట్టుపక్కల నివాసితులందరూ కలిసి డ్రెయిన్‌లో చెత్త తొలగించుకోవాల్సి వస్తోంది. లేదంటే దోమలు విజృంభిస్తున్నాయి.

– కుమారి, మాలపల్లి వాసి

డ్రెయినేజీ నిర్మించాలి

వైఎస్సార్ సీపీ హయాంలో గొయ్యి చుట్టు పక్కల ప్రాంతాల్లో రోడ్లు అభివృద్ధి చేశారు. ఎగువ ప్రాంతాలైన మాలపల్లిలో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడింది. ఇదే కోణంలో గొయ్యి చుట్టూ ఉన్న నివా స ప్రాంతాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. డ్రెయిన్ నిర్మాణంతో చెరువులోకి చేరుతున్న మురుగునీటికి అడ్డుకట్ట పడుతుందని చెబుతున్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి


ప్రొఫెసర్ రామ ప్రసాద్‌ను సన్మానిస్తున్న సీఆర్ఆర్ కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థి దశ నుంచే జీవన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, అందుకు అనుగుణంగా జ్ఞాన సముపార్జన, నైపుణ్య లక్షణాలు వృద్ధి చేసుకోవాలని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ ఎంవీ రామప్రసాద్ సూచించారు. సీఆర్ రెడ్డి కళాశాల ఎంబీఏ, సీఐఐఈ, ఈడీసీ, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగ లక్ష్యాలు అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామ ప్రసాద్ మాట్లాడుతూ డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉద్యోగాలు సంపాదించే రోజులు పోయాయని, ప్రతి విద్యార్థీ కాలానుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని, ఇంగ్లీష్ పరిజ్ఞానంపై పట్టు, వార్తా పత్రికలు చదివే అలవాటు, సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను నేర్చుకొని పోటీతత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా ఉద్యోగాలు సంపాదించడం సులభతరమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా రామప్రసాద్‌ను కళాశాల ప్రతినిధులు సన్మానించారు. సీఆర్ఆర్ పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస రావు, డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు యలమర్తి, ఎంబీఏ డైరెక్టర్ రంగు శ్రీనివాసరావు, సీఐఐఈ, ఈడీసీ కోఆర్డినేట ర్ తేర రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైదు కొండను పరామర్శించిన జేపీ


సైదుకొండను పరామర్శిస్తున్న జేపీ

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ నాయకులు సైదు కొండకు ప్రమాదవశాత్తు కాలికి దెబ్బ తగలడంతో మంగళవారం ఆయన నివాసానికి వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) వెళ్లి పరామర్శించారు. ఆయనకు మనో ధైర్యాన్ని కలిగించారు. జేపీ వెంట మాజీ డిప్యూటీ మేయర్ సుధీర్ బాబు,ఎక్స్ కో ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గుర్నాథ్, ఫణి, స్థానిక నాయకులు కొల్లిపర భగవాన్, ప్రభాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక దొండపాడులోని పరివర్తన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో మంగళవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలు గుర్తించి, వాటికి తక్షణ చికిత్స అందించడం అవసరమని రత్నప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

ఏలూరు టౌన్: పాతకక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం లింగారావుగూడెంకు చెందిన నూలు రంగారావు (42) ఆదే గ్రామానికి చెందిన బొడ్డు వెంకట్ (18) మధ్య దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారి జాతరలో వివాదం తలెత్తింది. పాత కక్షల నేపథ్యంలో వెంకట్ మరో యువకుడితో కలిసి ఈనెల 11వ తేదీ రాత్రి ఆ గ్రామ సెంటర్‌లో కూర్చుని ఉన్న రంగారావుతో గొడవ పెట్టుకున్నారు. చాకుతో పొడవడంతో తీవ్ర గాయాలపాలైన రంగారావుని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, అనంతరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఏలూరు రూరల్ ఎస్సై సీహెచ్ దుర్గా ప్రసాద్ వెంకట్, మరో యువకునిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు పెన్షనర్ల సంక్షేమ శాఖ ఏడీ పర్యటన

ఏలూరు(మెట్రో): పెన్షనర్ల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజు గుప్తా ఈ నెల 13న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఆర్ పేట బ్రాంచ్‌ను సందర్శిస్తారని లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి తెలిపారు. పింఛనుదారులు తమ జీవిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించడానికి ఈ కేంద్రాన్ని సందర్శించవచ్చన్నారు. ధ్రువీకరణ పత్రాలు డిజిటల్ ద్వారా సమర్పించేందుకు ఈ కేంద్రానికి రావాలన్నారు.

జాగృతికి మరో రికార్డు


సూపర్ కిడ్స్ రికార్డు సాధించిన జాగృతిని సత్కరిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన బాలిక నారాయణం జాగృతి మరో జాతీయ రికార్డు సాధించింది. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, ఏలూరు అర్బన్ ఆర్యవైశ్య మహిళా మండలి, ఏలూరు విజన్ లయన్స్ క్లబ్, అర్బన్ జిల్లా ఆర్య వైశ్య సంఘం ఏలూరు ఆధ్వర్యంలో నగరంలోని ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్‌లో మంగళవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో జాగృతి అసమాన ప్రతిభ కనబరిచింది. సహస్రాధిక ప్రశ్నోత్తర ప్రహేళికలో భాగంగా పదేళ్ల వయస్సులో 10 విభాగాలకు సంబంధించి 100 నిమిషాల్లో 1000కి పైగా ప్రశ్నలకు జవాబులు చెప్పింది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, సూపర్ కిడ్స్ రికార్డ్స్ ముఖ్య సమన్వయ కర్త సిరిమువ్వ శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి జాగృతి జాతీయ స్థాయిలో రికార్డులు సాధించినట్టు ధ్రువీకరించారు. ప్రత్యేక అతిథి జిల్లాచైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సీహెచ్ సూర్య చక్రవేణి, ఏలూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మానేపల్లి సత్య రామలక్ష్మి, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చలువాది శివకృష్ణ బ్రహ్మయ్య చేతుల మీదుగా జాగృతి పురస్కారం అందుకుంది. జాగృతి ఇప్పటి వరకూ 60 రికార్డులు సాధించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల పులిదండి కుటుంబరావు, నందనంపాటి వసంతి, నారాయణం శివశంకర్, సుగుణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ఉచ్చులో చిక్కుకోవద్దు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు సోషల్ మీడియా ఉచ్చులో చిక్కుకోవద్దని టూ టౌన్ ఎస్సై నాగ కళ్యాణి సూచించారు. మంగళవారం స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీ శర్వాణి ఉన్నత పాఠశాలలో సోషల్ మీడియా వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనే అంశంపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం అభయ మహిళా రక్షణ బృందం ఏర్పాటు చేశామని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 112 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని అన్నారు. హెచ్ఎం సత్యశారద, డైరెక్టర్ మదన్ మోహన్ రాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై వినతి


ఈఎన్‌సీ రత్నకుమార్‌ను కలిసిన జల వనరుల శాఖ ఉద్యోగులు

ఏలూరు(మెట్రో): ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జల వనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ టీవీఎస్ఏ రత్నకుమార్‌ను ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ కోరారు. విజయవాడలో మంగళవారం రత్నకుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఏపీఎంఎస్ నుంచి ఏపీఈఎస్ఎస్‌కు మారే క్రమంలో ఉద్యోగి ఏఈ/ఏఈఈ కోసం సాధించుకున్న అర్హతలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఎన్‌టీపీఏ పదోన్నతి కోసం సీనియారిటీ జాబితాను తయారు చేయాలని పేర్కొన్నారు. జూనియర్ అసిస్టెంట్లను హెచ్‌వోడీలోకి విలీనం చేయడం పట్ల ఈఎన్‌సీకి కృతజ్ఞతలు తెలిపారు. జల వనరుల శాఖ రాష్ట్ర నాయకులు, ఎన్‌టీఆర్ జిల్లా నాయకులు, ఈఎన్‌సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ నెల 14న బాలల దినోత్సవంతో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు తెలిపారు. 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన, పుస్తక పఠనంపై కార్యక్రమాలు, 16న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుట, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ వ్యాసరచన, క్రీడా పోటీల నిర్వహణ, 19న మహిళా దినోత్సవం, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహనతో వారోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్‌కుమార్, కార్యాలయ సిబ్బంది శ్యాంబాబు, కుమార్ పాల్గొన్నారు.

చాటపర్రులో గ్రంథాలయ వారోత్సవాలు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ పరివేక్షురాలు కె.వాసుకి తెలిపారు. 20వ తేదీ ఆఖరిరోజు పోటీల్లో ప్రతిభ చాటిన బాలబాలికలకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


జయప్రకాష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆధ్యాత్మిక మార్గంలో పయనించే ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతతో జీవిస్తారని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. స్థానిక బెనర్జీపేట పాండురంగ థియేటర్ వద్ద ఉన్న దాసాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామి వారికి కార్తీకమాసం మంగళవారం సింధూర అర్చన చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, రెల్ల రామకృష్ణ ఆహ్వానం మేరకు జయప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వామి వారి పూజ, అన్నదాన కార్యక్రమాల్లో ఆయన పాలొన్నారు. ప్రతి మంగళవారం అన్నదానం చేయడం అభినందించాల్సిన విషయమని ఆలయ కమిటీ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు జయప్రకాష్‌ను దుశ్శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మున్నుల జాన్ గుర్నాథ్, కొల్లిపర భగవాన్, బి.ప్రభాకర్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివాహంతో బాల్యాన్ని బందీ చేయొద్దు


కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారిణి సూర్యచక్రవేణి

ఏలూరు రూరల్: బాల్య వివాహాల ద్వారా పిల్లల బాల్యాన్ని బందీ చేయవద్దని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి సీహెచ్ సూర్యచక్రవేణి అన్నారు. నోడల్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పద్మావతి అధ్యక్షతన మంగళవారం ఏలూరు రూరల్ ఎంఈఓ కార్యాలయంలో బాల్య వివాహ నిషేధంపై అధికారులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సూర్యచక్రవేణి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓలు 31, 39 జారీ చేసిందని తెలిపారు. బాల్య వివాహాలను అడ్డుకోవడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. బాలల భవిష్యత్తు వికాసానికి కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలపై చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ 1098కు తెలియజేయాలని తెలిపారు. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో డీఈఓ వెంకటలక్ష్మి, జిల్లా బాలిక అభివృద్ధి అధికారిణి నజియా సుల్తానా, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఎండీ షరీఫ్, డీసీపీయూ సిబ్బంది రాజు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలని ఏలూరు అర్బన్ ప్రాజెక్టు అధికారి ఎ.పద్మావతి పిలుపు నిచ్చారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో మిషన్ శక్తి ద్వారా అమలవుతోన్న పథకాలపై అవగాహన సదస్సు స్థానిక తంగెళ్లమూడిలో మంగళవారం నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టాలను వివరించారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ సీహెచ్ నిర్మల మాట్లాడుతూ బాధిత మహిళలు, బాలికలకు అందుతోన్న సేవలు, న్యాయపరమైన సేవలు, రక్షణ, తాత్కాలిక వసతులుపై అవగాహన కల్పించారు. ఆపద సమయాల్లో అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నెంబర్లు 181, 112, బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై మాట్లాడారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ వర్కర్ తిరుపతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.మంగ, అంగన్‌వాడీ వర్కర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వృద్ధురాలి సమస్య తెలుసుకున్న డీఎస్పీ


వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న డీఎస్పీ

ఏలూరు (టూటౌన్): తన కార్యాలయానికి మంగళవారం నడవలేని స్థితిలో వచ్చిన వృద్ధురాలి వద్దకు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ వచ్చి సమస్య అడిగి తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కారానికి ఆదేశించారు. ఏలూరు పట్టణానికి చెందిన వృద్ధురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు ఆస్తి కోసం తనను వేధింపులకు గురిచేస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని డీఎస్పీని కోరింది. దీంతో డీఎస్పీ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చట్ట ప్రకారం సమస్య పరిష్కారానికి ఆదేశించారు. డీఎస్పీకి వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్‌కు ఎస్పీ అభినందన


సీనియర్ అసిస్టెంట్ కృష్ణంరాజుకు మెమెంటో అందిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పి.శ్రీకృష్ణంరాజును ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు. ప్రాధాన్యతాంశాలలో ఉన్నతాధికారులకు చేదోడుగా ఉంటూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీకృష్ణంరాజుకు మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎం సూర్యచంద్రరావు, ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయం ఏఓ బీవీఎస్ఆర్కె నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మూర్తిరాజు ఆశయాలు స్ఫూర్తిదాయకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాకు చెందిన ప్రముఖ విద్యాదాత చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద మూర్తిరాజు ఆశయాల స్ఫూర్తితో విద్యాభివృద్ధికి కృషి చేయాలని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఏఆర్‌కే బాబూరావు అన్నారు. స్థానిక ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యాదాత మూర్తిరాజు 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ లారెన్స్ మాస్టర్ మాట్లాడుతూ మూర్తిరాజు జిల్లా వ్యాప్తంగా అనేక విద్యా సంస్థలను నెలకొల్పి, ఎంతోమందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు సరోన్ ఉజ్వల మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు పూలబాట వేసిన వ్యక్తిగా మూర్తిరాజు చిరస్థాయిగా నిలుస్తారన్నారు. తొలుత మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, సోషల్ వర్కర్ గొంతిన రామకృష్ణ, మేతర అజయ్ బాబు, ఐఎఫ్‌టీయూ నాయకుడు కాకర్ల శ్రీను, ఎన్‌వీ గంగాభవాని, వైవీఎస్ పార్వతి, కేవీ జ్యోతి, బనిశెట్టి రవి కుమార్, బీవీ రమణారావు, పి.సోమరాజు, గజ్జల నాగేంద్ర, తోటకూర యాకోబు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నుంచి వృద్ధుడి అదృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వృద్ధుడి అదృశ్యంపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కామవరపుకోట మండలం అడమిల్లి గ్రామానికి చెందిన పసుపులేటి దావీదును అక్టోబర్ 12న ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. 19వ తేదీన అతను ఆసుపత్రి నుంచి అదృశ్యమయ్యాడు. నాటి నుంచి ఆచూకీ కానరాకపోవడంతో అతని కుమారుడు రాజు మంగళవారం ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): చేతి వృత్తిదారులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి ఆదుకోవాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచిన రూ.17 వేల కోట్లు విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఆర్ పేటలోని చేతి వృత్తిదారుల జిల్లా కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ అధ్యక్షతన ఏలూరు జిల్లా సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన మద్యం పాలసీని, జమిలి ఎన్నికల విధానాన్ని రద్దు చేయాలని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఆదిశేషు కోరారు. సమావేశంలో బీసీ జేఏసీ నాయకులు మల్లిపూడి రాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఏలూరు టౌన్: పురుగుమందు తాగిన యువకుడు తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చాట్రాయి మండలం కోటపాడు గ్రామానికి చెందిన పర్సా భరతకుమార్ (18) ఈనెల 11వ తేదీన పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహాన్ని ఆసుపత్రి మార్చురీకి తరలించారు.